అన్నదాత.. గుండె కోత

ఇంటిల్లిపాదీ కష్టపడి పని చేసినా రైతుకు భరోసా కనిపించడం లేదు. ఒకవైపు అతివృష్టి, మరో వైపు అనావృష్టి. రెండింటిలో ఏదైనా రైతుకు నష్టమే. వేలాది రూపాయల పెట్టుబడులు పెట్టి సాగు చేద్దామన్నా ప్రకృతి కరుణించక అప్పుల పాలు కావాల్సి వస్తుంది. సీజన్‌కు అవసరమయ్యే పంటల సాగుపై దృష్టి సారిస్తున్నా అకాల వర్షాలు రైతులను కుంగదీస్తున్నాయి. వ్యవసాయమంటేనే ఎందుకులే అనే పరిస్థితి రైతులకు దాపురిస్తోంది. ఎప్పుడు వర్షాలు కురుస్తాయో తెలియక అయోమయానికి గురవుతున్నారు అన్నదాతలు.

- ముంచెత్తిన వర్షాలతో తీవ్రంగా నష్టపోయిన రైతులు
- వృథా అవుతున్న రూ. వేల పెట్టుబడులు
- జిల్లావ్యాప్తంగా వరి సాధారణ విస్తీర్ణం 53,121 హెక్టార్లు
- ఇంత వరకు జరిగింది 45,408 హెక్టార్లు మాత్రమే


కాలువలో పేరుకుపోయిన తూటికాడను తొలగిస్తున్న రైతులు


మునగపాక తంపరమూల ప్రాంతంలో చెరువును తలపిస్తున్న వరి పొలం


మునగపాక నుంచి వాడ్రాపల్లికి వెళ్లే దారిలో ముంపునకు గురైన వరి పొలం

మునగపాక : మండలవ్యాప్తంగా వరి నారుమడులు తుది దశకు చేరుకుంటున్నాయనే చెప్పాలి. ఖరీఫ్‌కు అవసరమయ్యే విత్తనాలు, ఎరువులను అందుబాటులోకి తీసుకురావడంతో రైతులంతా సాగు పనుల్లో నిమగ్నమైపోయారు. కొన్నిచోట్ల వరి ఉడుపులు పూర్తి కాగా మరికొన్ని చోట్ల ఆఖరి దశకు చేరుకున్నాయి. ఇంతలో అకాల వర్షాలు రైతులను నట్టేట ముంచేశాయి. వరిపైరు ముంపునకు గురి కావడంతో పాటు చెరువులు, కాలువలు పొంగి ప్రవహిస్తుండడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. ఇటీవల భారీ వర్షాలు కురవడంతో వరి సాగు చేసే రైతులకు నష్టాలు తప్పలేదు. ఎకరాకు రూ.20 వేలకు పైగా పెట్టుబడులు పెట్టారు. అయితే ఈ వర్షంతో పంటంతా నీట మునిగిపోవడంతో రైతులు కన్నీటిపర్యంతం అవుతున్నారు.

సాగులో వెనుకబాటు..

అనకాపల్లి జిల్లావ్యాప్తంగా ఖరీఫ్ వరి సాధారణ విస్తీర్ణం 53121 హెక్టార్లు కాగా ఇంతవరకు 45408 హెక్టార్లలో వరి సాగు చేపట్టారు. మరో వారం, పది రోజుల్లోగా లక్ష్యాన్ని చేరుకునే లోపల తుపాను రైతాంగాన్ని దెబ్బతీసింది. ఈ ఏడాది ఆశించిన స్థాయిలో వరి సాగుబడి జరుగుతుందని ఆశిస్తున్న తరుణంలో వరుణదేవుడు రైతుల పాలిట శాపంగా మారాడనే చెప్పాలి. ఆరుగాలం ఇంటిల్లిపాదీ కష్టపడి సాగు చేసే తరుణంలో అకాల వర్షాలు ముంచేశాయంటూ రైతులు గగ్గోలు పెడుతున్నారు. దీనికి తోడు ఎగువ నుంచి భారీ వరద నీరు వచ్చేయడంతో సాగునీటి చెరువులు, కాలువలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. దీంతో రైతుకు కంటిమీద కునుకు లేకుండా పోయింది.

ఐదెకరాలు నీట మునిగాయి..



వాడ్రాపల్లి ఆవ ప్రాంతంలో 5 ఎకరాలకు పైగా వరి నాటాను. ఇందుకోసం రూ.లక్షకు పైగా పెట్టుబడి కింద ఖర్చు చేశా. అయితే ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పంటంతా నీట మునిగిపోయింది. పెట్టుబడులు కోల్పోవాల్సి వచ్చింది. వరుణదేవుడు కరుణించకపోవడంతో నాతో పాటు ఇతర రైతులు సైతం నష్టాల బారిన పడాల్సి వస్తుంది. ప్రభుత్వం బాధిత రైతులకు న్యాయం జరిగేలా చూడాలి.

– కాంద్రేగుల నూకరాజు, రైతు, వాడ్రాపల్లి

జరిగిన నష్టం ప్రభుత్వానికి నివేదిస్తాం..



ముంపునకు గురైన వరిపొలంలో నీరు బయటకు పోయేలా చూడాలి. ఎంతమేర వరికి నష్టం వాటిల్లిందనే వివరాలు సిబ్బందితో సేకరిస్తాం. ప్రభుత్వానికి నష్టం నివేదిస్తాం. బాధిత రైతులకు ప్రభుత్వం ద్వారా సాయం అందుతుంది. రైతులు కూడా అధికారులకు సహకరించాలి. నీటి ప్రవాహం తగ్గిన తర్వాత తగు జాగ్రత్తలు తీసుకోవాలి.

– సీహెచ్ జ్యోత్స్నకుమారి, మండల వ్యవసాయాధికారి

క్లుప్తంగా

ఆకట్టుకున్న కూచిపూడి నృత్యం


నృత్య కళాకారులను మెమెంటోలతో సత్కరిస్తున్న కమిటీ సభ్యులు

కోటవురట్ల: వినాయక నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా పలు ప్రాంతాల్లో గణనాథుడి విగ్రహాలను ఘనంగా ఊరేగించి నిమజ్జనం చేస్తున్నారు. మండల కేంద్రంలోని సీతారామరాజునగర్‌లో శ్రీ బాల వినాయక యూత్ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి సంస్కృతీ సంప్రదాయాలు ఉట్టిపడేలా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. నర్సీపట్నానికి చెందిన నృత్య కళాకారులు కూచిపూడి, భరతనాట్యంతో ఆకట్టుకున్నారు. సమీప గ్రామాల నుంచి వచ్చిన భక్తులను నృత్య ప్రదర్శనలతో కట్టిపడేశారు. ఉత్సవ కమిటీ సభ్యులు కళాకారులను ఘనంగా సత్కరించి మెమెంటోలు అందజేశారు.

ఎంఈవో-2గా సత్తిబాబు బాధ్యతల స్వీకరణ


సత్తిబాబును సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

ఎస్.రాయవరం: ఎంఈవో-2గా చినగుమ్ములూరు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బి.సత్తిబాబు గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా పలు పాఠశాలల ఉపాధ్యాయులు ఎంఈవో కార్యాలయానికి వచ్చి దుశ్శాలువాతో ఆయనను సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. వారిలో పీఆర్‌టీయూ మండల శాఖ అధ్యక్షుడు భద్రరావు, కార్యదర్శి శ్రీనివాసరావు, పలు పాఠశాల ఉపాధ్యాయులు గారా ప్రకాష్, రమేష్‌బాబు ఉన్నారు.

పీహెచ్‌సీ వైద్యుల నిరసన


నిరసన తెలుపుతూ వైద్య సేవలందిస్తున్న పీహెచ్‌సీ వైద్యాధికారి

పాయకరావుపేట: ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన జీవో నంబర్ 85ను రద్దు చేయాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్య సంఘం నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పాయకరావుపేట పీహెచ్‌సీ వైద్యులు తెలిపారు. ఈ నెల 16 వరకు నిరసన కార్యక్రమాలు కొనసాగుతాయన్నారు. ఈమేరకు గురువారం పీహెచ్‌సీ వైద్య సిబ్బంది నిరసన వ్యక్తం చేస్తూ ప్రజలకు వైద్య సేవలందించారు.

ఉత్తమ ఉపాధ్యాయుడికి సన్మానం


రవిబాబును సన్మానిస్తున్న ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘ నాయకులు

పాయకరావుపేట: మండలంలోని గుంటపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్ (హిందీ)గా పని చేస్తున్న బి.పి.రవిబాబును ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘ నాయకులు సన్మానించారు. జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఈ నెల 5న కలెక్టర్ చేతుల మీదుగా ఆయన ప్రశంసా పత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా ఎంఈవో కె.ఎస్.గాంధీ ఆధ్వర్యంలో ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘ సభ్యులు రవిబాబును ఘనంగా సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

విఘ్నేశ్వరుని జీవిత చరిత్రపై వ్యాస రచన పోటీ

మునగపాక : విఘ్నేశ్వరుని జీవిత చరిత్రపై వ్యాస రచన పోటీలు నిర్వహిస్తున్నట్లు శ్రీ వెంకటేశ్వర మునగపాకలోని గీతా ప్రచార సమితి కన్వీనర్ శరగడం పరదేశినాయుడు తెలిపారు. ప్రజల్లో భక్తి భావం పెంపొందించడంలో భాగంగా వినాయక జీవిత చరిత్ర, మానవులు గ్రహించాల్సిన నీతి వంటి అంశాలపై వ్యాస రచన పోటీలు ఉంటాయన్నారు. ఆసక్తి గల ప్రతి ఒక్కరూ ఈ నెల 18లోగా తెలపాలన్నారు. మొదటిబహుమతిగా రూ.2116, ద్వితీయ బహుమతిగా రూ.1116, తృతీయ బహుమతిగా రూ.558 వంతున 21న అందజేస్తామన్నారు. ఈ అవకాశాన్ని వయస్సుతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని పరదేశినాయుడు కోరారు.

ఘనంగా చోడమాంబ పండగ


చోడపల్లి అమ్మవారి పండగలో ఆటో డ్రైవర్లు

అచ్యుతాపురం (మునగపాక) : అచ్యుతాపురం యువశక్తి ఆటో యూనియన్ ఆధ్వర్యంలో గురువారం చోడపల్లి అమ్మవారి పండగను ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి ఆటోలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ అధ్యక్షుడు దమ్ము చండి, ఉపాధ్యక్షుడు తట్టా రాజు, కార్యదర్శి పోలవరపు అప్పారావు, కోశాధికారి దర్మిరెడ్డి సన్నిబాబు పాల్గొన్నారు.

రైతులంతా ఈకేవైసీ చేయించుకోవాలి


రైతులకు ఈకేవైసీ చేస్తున్న ఏవో ఉమాప్రసాద్

నక్కపల్లి: మండలంలోని రైతులంతా ఈకేవైసీ చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి ఉమా ప్రసాద్ కోరారు. గురువారం ఆయన నక్కపల్లి ఆర్‌బీకే వద్ద రైతులకు ఈకేవైసీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలో సుమారు 4,537 ఎకరాల్లో వ్యవసాయ పంటలు, 14,504 ఎకరాల్లో ఉద్యాన వన పంటలు సాగవుతున్నాయని తెలిపారు. ఇందుకు అనుగుణంగా ఆయా గ్రామాల్లో జాయింట్ అజమాయిషీ ద్వారా గ్రామ రెవెన్యూ అధికారి, సర్వేయర్‌లు, రైతు సేవా కేంద్ర సిబ్బంది ఈ పంటలు నమోదు చేస్తున్నారన్నారు. ఈ-పంట నమోదైన తర్వాత రైతులు ఈకేవైసీ చేయించుకోవాలని సూచించారు. దీని వల్ల అన్నదాత, పీఎం కిసాన్, పంటరుణాలకు ఈ క్రాప్ సర్టిఫికెట్, పంట నష్టపరిహారం, క్రాప్ ఇన్సూరెన్స్ వంటివి వస్తాయన్నారు. ఈకేవైసీ కచ్చితంగా చేయించుకున్న వారికే ఈ పథకాలు, రాయితీలు వర్తిస్తాయని చెప్పారు. ఈ-పంట నమోదుకు దరఖాస్తు ఫారం, ఆధార్ కార్డు తాజా ఒన్‌బీ, బ్యాంకు అకౌంట్, ఫోన్ నంబర్ సమర్పించాల్సి ఉంటుందన్నారు. ఏఈవో సత్యనారాయణ పాల్గొన్నారు.

కిసాన్ మిత్ర సేవలు సద్వినియోగం చేసుకోవాలి


మాట్లాడుతున్న కిసాన్ మహిళా మిత్ర చైర్మన్ సురేష్

అచ్యుతాపురం (మునగపాక) : అచ్యుతాపురం మండలం హరిపాలెంలో గురువారం బలరాం జయంతి ఘనంగా నిర్వహించారు. కిసాన్ మహిళా మిత్ర ఏపీవో ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మహిళా మిత్ర చైర్మన్ సురేష్ పాల్గొని మాట్లాడారు. కిసాన్ మిత్ర ద్వారా అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. నీటిపారుదల శాఖ ద్వారా డ్రిప్ ఇరిగేషన్‌కు రూ.40 లక్షల విలువ చేసే పైపులను అందజేస్తున్నారన్నారు. ఈ నెల 28, 29 తేదీల్లో అనకాపల్లిలో రైతు మేళా జరుగుతుందన్నారు. కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త నాగేంద్రప్రసాద్ సీజన్‌లో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అలాగే పంటలకు సంబంధించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎంఐపీ ప్రతినిధి రంజిత, కొండకర్ల ఎంపీటీసీ శ్రీను, జోగినాయుడు, కిరణ్‌కుమార్, కిసాన్ మహిళా మిత్ర ఎఫ్‌పీవో రాజు పాల్గొన్నారు.

పాత పింఛన్ విధానమే అమలు చేయాలి

యలమంచిలి రూరల్ : ప్రభుత్వ స్కూళ్లలో పని చేస్తున్న ఉపాధ్యాయులందరికీ పాత పింఛను విధానం (ఓపీఎస్) అమలు చేయాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర, జిల్లా నాయకులు డిమాండ్ చేశారు. గురువారం యలమంచిలి మండలంలో వివిధ పాఠశాలలను సందర్శించిన ఏపీటీఎఫ్ రాష్ట్ర మాజీ కార్యదర్శి వెంకటపతిరాజు, జిల్లా అధ్యక్షుడు కర్రి ధర్మారావు ఒక ప్రకటనలో ప్రభుత్వ స్కూళ్లలో వివిధ సమస్యలను తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు. జీవో నంబరు 117ను రద్దు చేసి, ఎస్‌సీఈఆర్టీ సిలబస్ అమల్లోకి తేవాలన్నారు. ఇటీవల జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలిగా అవార్డు పొందిన పట్టా వరలక్ష్మిని సత్కరించారు. యలమంచిలి మండల ఏపీటీఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులు బొడ్డేటి సత్యనారాయణ, మల్లిపాటి సత్యనారాయణ, కె. వీరభద్రరావు, పి. అప్పారావు, జి సర్వేశ్వరరావు, పి. శ్రీనివాసరావు, బి. లక్ష్మణరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పాయకరావుపేట: పట్టణంలోని విద్యుత్ ఉపకేంద్రం కండక్టరు మార్పు నిమిత్తం శుక్రవారం ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ ఎస్.రాజశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీరాంపురం ఫీడర్‌కు దగ్గరగా ఉన్న చెట్టు కొమ్మలు తొలగిస్తామన్నారు. గ్రామస్తులు గమనించాలని కోరారు.

యలమంచిలి రూరల్ : యలమంచిలి, కశింకోట, ఎస్. రాయవరం మండలాల్లో పలు విద్యుత్ ఉప కేంద్రాల పరిధిలో శుక్రవారం విద్యుత్ లైన్ల నిర్వహణ పనుల్లో భాగంగా యలమంచిలి మండలంలోని పులపర్తి, లక్కవరం, విశాఖ బయోమెరైన్ పరిశ్రమ, పెదోషకిళ్లపాలెం, చిన షేకిళ్లపాలెం, కొక్కిరాపల్లి, తండాల దిబ్బ, జంపపాలెం, తురంగలపాలెం, మునగపాక మండలం మెలిపాక, యాదగిరిపాలెం గ్రామాల్లో శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు అనకాపల్లి ఏపీఈపీడీసీఎల్ ఆపరేషన్స్ ఈఈ కె. రాజశేఖర్ తెలిపారు.

మునగపాక : వెంకటాపురం సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్ నిర్వహణలో భాగంగా ఉదయం 9.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సిరసపల్లి, వెంకటాపురం, తోటాడ, గవర్ల అనకాపల్లి, మూలపేట, రామారాయుడుపేట, నారాయుడుపాలెం గ్రామాలకు విద్యుత్ సరఫరా జరగదని తెలిపారు.

భారీ అన్నసమారాధన


అన్నప్రసాదం వడ్డిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఎస్.రాయవరం: మండల కేంద్రం ఎస్.రాయవరంలో గురువారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. గురజాడ కళాక్షేత్రంలో ప్రతిష్ఠించిన గణపతికి ప్రత్యేక పూజలు చేసి పెద్ద ఎత్తున భక్తులకు అన్నప్రసాదం అందించారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బొలిశెట్టి గోవిందరావు, జిల్లా కమిటీ కార్యదర్శి కొణతాల శ్రీనివాసరావు, సర్పంచ్ భూపతి అప్పారావు, మాజీ సర్పంచ్ లక్కోజు ఆదిమూర్తి తదితరులు పాల్గొని అన్నదానం చేశారు.

కేజీహెచ్‌కు వెళ్లి పరామర్శ


కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న రమణను పరామర్శిస్తున్న కంబాల జోగులు

ఎస్.రాయవరం: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వైఎస్సార్‌సీపీ నాయకుడు చోడిపల్లి రమణ త్వరగా కోలుకోవాలని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ పాయకరావుపేట ఇన్‌చార్జి కంబాల జోగులు ఆకాంక్షించారు. రేవుపోలవరం గ్రామానికి చెందిన చోడిపల్లి రమణ రెండు రోజుల కిందట రోడ్డు ప్రమాదానికి గురై తలకు తీవ్ర గాయమైంది. ఈ మేరకు కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న ఆయనను గురువారం కంబాల జోగులు, మండల యూత్ అధ్యక్షుడు నల్లపరాజు వెంకటరాజు, వైస్ ఎంపీపీ చోడిపల్లి అప్పన్న, వమ్మవరం సర్పంచ్ పాలపర్తి పాపారావు తదితరులు పరామర్శించారు.

సీతారాం ఏచూరికి ఘన నివాళి


నక్కపల్లిలో ఏచూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

నక్కపల్లి: సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మరణం పార్టీకి, దేశానికి తీరని లోటని ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం.అప్పలరాజు అన్నారు. అనారోగ్యానికి గురైన ఆయన ఢిల్లీలోని ఎయిమ్స్‌లో చికిత్స పొందుతూ గురువారం మరణించారని తెలిపారు. నక్కపల్లిలో ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా అప్పలరాజు మాట్లాడుతూ కమ్యూనిస్ట్ ఉద్యమంలో ఏచూరి చెరగని ముద్ర వేశారన్నారు. ఆయన మరణంతో జాతీయ స్థాయిలో పేదల గొంతు మూగబోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. సీతారాం ఆశయ సాధన కోసం పాటుపడాలన్నారు. కార్యక్రమంలో నాయకులు సత్యనారాయణ, రాజేష్, అప్పలరాజు, బాపూజీ, భూలోక తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారులకు ఇచ్చిన హామీ నెరవేర్చాలి



మాట్లాడుతున్న సీపీఎం కన్వీనర్ రాము

అచ్యుతాపురం (మునగపాక) : మత్స్యకారులకు ప్రకటించిన చేపల వేట నిషేధ సాయం అందజేసి వారిని ఆదుకోవాలని సీపీఎం మండల కన్వీనర్ రొంగలి రాము డిమాండ్ చేశారు. గురువారం ఆయన పూడిమడకలోని మత్స్యకారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం చేపల వేటపై ఆధారపడే ప్రతి ఒక్కరికీ రూ.10 వేలు అందజేసిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు కావస్తున్నా ఇంత వరకు గతంలో ఇచ్చే రూ. 10 వేలను రూ. 20 వేలకు పెంచి ఇస్తామంటూ ఇచ్చిన హామీ అమలు కాలేదన్నారు. అధికారుల చుట్టూ మత్స్యకారులు పదేపదే తిరిగినా ఫలితం లేకుండా పోతుందన్నారు. తరచూ తుపాన్లు రావడంతో మత్స్యకారులు ఉపాధి లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. వారికి నిత్యావసర సరకులు పంపిణీ చేయడంతో పాటు ప్రభుత్వం ప్రకటించిన రూ.20 వేలను తక్షణమే అందించాలని కోరారు. సమావేశంలో సీపీఎం గ్రామ కార్యదర్శి చోడపల్లి అప్పారావు, చేపల తాతయ్య, కూండ్రపు సోమునాయుడు, చేపల సత్తిబాబు, బాలయ్య, దానయ్య, మసేను తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా తూటికాడ తొలగింపు పనులు


మునగపాక కృష్ణంరాజు కాలువలో తూటికాడ తొలగిస్తున్న రైతులు


గవర్ల అనకాపల్లి వద్ద కాలువలో పొక్లెయిన్‌తో తూటికాడ తొలగింపు పనులు

మునగపాక : రైతుల సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ చర్యలు చేపట్టారు. ఇటీవల కురిసిన వర్షాల కారణంగా సాగునీటి కాలువలు, చెరువులకు తూటికాడ అడ్డంకిగా నిలిచిపోవడంతో నీటి ప్రవాహం సాఫీగా సాగలేదు. ఈ సమస్యను రైతులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. దీంతో తోటాడ పంచాయతీ గవర్ల అనకాపల్లి బ్రిడ్జి వద్ద కాలువలో పేరుకుపోయిన తూటికాడను గురువారం జేసీబీ సాయంతో తొలగింపు పనులు ప్రారంభించారు. పొక్లెయిన్ అవకాశం లేని చోట రైతులే నేరుగా కాలువల్లో దిగి తూటికాడ తొలగింపు చేపడుతున్నారు. మునగపాకలోని కృష్ణంరాజు కాలువలో పేరుకుపోయిన తూటికాడను రైతులు తొలగిస్తున్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి


ఎమ్మెల్యే విజయకుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న రాంబిల్లి మండల నేతలు

అచ్యుతాపురం (మునగపాక) : తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రాంబిల్లి మండల ఎన్ఏబీ బాధితులు గురువారం ఎమ్మెల్యే విజయకుమార్‌కు వినతిపత్రం అందజేశారు. కొత్తపేట సర్పంచ్ వానపల్లి అరుణలత ఆధ్వర్యంలో విజయకుమార్‌ను కలిసి తమకు న్యాయం చేయాలని కోరారు. గతంలో పైడమ్మ ట్యాంక్ దగ్గర 16 మంది దళిత రైతులకు పట్టాలు అందజేశారని, వారికి రాయితీలు అందేలా చూడాలన్నారు. ఇందుకు స్పందించిన విజయకుమార్ సమస్య పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో కొత్తపేట గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

జీవో 115 రద్దు చేయాలి

ఏరియా ఆస్పత్రి వద్ద నర్సుల నిరసన


నక్కపల్లి ఏరియా ఆస్పత్రి వద్ద నిరసన తెలుపుతున్న స్టాఫ్ నర్సులు

నక్కపల్లి: స్టాఫ్ నర్సుల స్థానంలో సచివాలయంలో పనిచేసే ఏఎన్‌ఎంలను నియమించడాన్ని వ్యతిరేకిస్తూ గురువారం నక్కపల్లి ఏరియా ఆస్పత్రిలో పనిచేసే నర్సులు నిరసన వ్యక్తం చేశారు. నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. ప్రభుత్వం విడుదల చేసిన జీవో నంబర్ 115ను వెంటనే రద్దు చేయాలని వారంతా డిమాండ్ చేశారు. ప్రస్తుతం ప్రభుత్వ ఆస్పత్రుల్లో పనిచేసిన తామంతా బీఎస్సీ నర్సింగ్, ఎమ్మెస్సీ నర్సింగ్, జనరల్ నర్సింగ్ వంటి డిగ్రీ, పీజీ కోర్సులు పూర్తి చేసి స్టాఫ్ నర్సులు, హెడ్‌నర్సులుగా విధులు నిర్వర్తిస్తున్నామన్నారు. ఇటువంటి అర్హతలతో చేసే ఉద్యోగాల్లో కేవలం 18 నెలల ఏఎన్‌ఎం కోర్సు పూర్తి చేసిన వారిని స్టాఫ్ నర్సులుగా నియమించడం తగదన్నారు. జీవో రద్దు చేసే వరకు ఇదే విధంగా ఏరియా ఆస్పత్రులు, పీహెచ్‌సీల్లో పనిచేసే సిబ్బంది అంతా నిరసన కార్యక్రమాలు కొనసాగించాలని నిర్ణయించామని చెప్పారు.

స్టాఫ్ నర్సుల స్థానంలో ఏఎన్‌ఎంలా..?

సచివాలయాల్లో పనిచేసే ఏఎన్‌ఎంలకు రూ.5 వేల స్టయిఫండ్ ఇచ్చి స్టాఫ్ నర్సుల పోస్టుల్లో నియమించాలని రాష్ట్ర ప్రభుత్వం జీవో 115 విడుదల చేసిందని ఏరియా ఆస్పత్రి నర్సులు అన్నారు. దీని వల్ల 20 ఏళ్ల నుంచి కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్న స్టాఫ్ నర్సులు, నర్సులకు తీరని అన్యాయం జరుగుతుందన్నారు. తమను రెగ్యులర్ చేయకుండా, ఉద్యోగ భద్రత కల్పించకుండా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వారంతా తప్పుపట్టారు. తమ ఉద్యోగాలకు ముప్పు వాటిల్లే అవకాశముందని, తక్షణమే ఈ జీవోను రద్దు చేసి తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని, తమ ఉద్యోగాలను రెగ్యులర్ చేయాలని కోరారు. కార్యక్రమంలో హెడ్ నర్సు వరలక్ష్మి, స్టాఫ్ నర్సులు కావేరి, జీవనజ్యోతి, పద్మజ, వి.వరలక్ష్మి, రూతుకుమారి, నూకరత్నం, కృష్ణవేణి, అప్పలనర్స, ఫార్మాసిస్ట్ ఇమామ్ తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణదారులపై చర్యలకు ఫిర్యాదు


ఫిర్యాదు కాపీ చూపిస్తున్న రైతు అప్పలరాజు

మునగపాక : మండలంలోని గణపర్తి శారదా నది సమీపంలో ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ గురువారం మారిశెట్టి అప్పలరాజు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. శారదా నదిపై నరసాపురం ఆనకట్ట నిర్మాణానికి సేకరించిన స్థలాన్ని కొంత మంది రైతులు ఆక్రమించి అడ్డదారిలో పట్టాదారు పుస్తకాలు పొందారన్నారు. ఇప్పటికే ఆర్‌డీవో కార్యాలయం అధికారులకు ఈ విషయమై ఫిర్యాదు చేసినా స్థానిక రెవెన్యూ అధికారులు ఇంత వరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదన్నారు. ఆక్రమణ దారులకు కొంతమంది అధికారులు కొమ్ము కాస్తున్నారన్నారు. ఉన్నతాధికారులు స్పందించి అడ్డదారిలో పట్టాదారు పుస్తకాలు పొందిన రైతులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయమై డీటీ వినయ్‌ను వివరణ కోరగా ఆక్రమణకు సంబంధించి అందిన ఫిర్యాదుపై విచారణ చేపడతున్నామన్నారు.

ధర్మారావు మాస్టారుకు గ్రామస్తుల సత్కారం


ధర్మారావు మాస్టారును సత్కరిస్తున్న గ్రామస్తులు

ఎస్.రాయవరం: గుర్రాజుపేట పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కె.కె.ఎల్.ఎన్.ధర్మారావును స్వగ్రామస్తులు తిమ్మాపురంలో గురువారం ఘనంగా సత్కరించారు. ఉపాధ్యాయ దినోత్సవం నాడు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు అందుకున్న ఆయనను గ్రామ పెద్దలు పంచాయతీ కార్యాలయంలో సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా సర్పంచ్ కర్రి సత్యనారాయణ మాట్లాడుతూ ధర్మారావు పాఠశాల ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నప్పటికీ గ్రామాభివృద్ధిలో కూడా పాల్గొని అన్ని వర్గాల వారికి అందుబాటులో ఉంటారన్నారు. ఆయను ఉత్తమ అవార్డు రావడం అభినందనీయమన్నారు. ధర్మారావు మాస్టారును సత్కరించిన వారిలో గ్రామ పెద్దలు వంగలపూడి గోవిందు, గుర్రం రామకృష్ణ, కటకం సత్యనారాయణ, కర్రి చంద్రశేఖర్, రిటైర్డ్ ఉపాధ్యాయులు సింహాచలం, అప్పలరాజు, సేనాపతి బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ వినియోగంపై అవగాహన



గ్యాస్ వినియోగంపై అవగాహన కల్పిస్తున్న కళాజాత బృందం

పాయకరావుపేట: పట్టణంలోని శ్రీ సాయి ఇండేన్ గ్యాస్ సర్వీస్ డిస్ట్రిబ్యూటర్ ప్రసాద్ ఆధ్వర్యంలో గురువారం ఆరట్లకోట, మంగవరం గ్రామాల్లో కళాజాత నిర్వహించారు. వంట గ్యాస్ ప్రమాదాలను అరికట్టే విధానం, వంట గ్యాస్ పొదుపు, ఉజ్వల పథకం ద్వారా మహిళలకు ఉపయోగాలను వివరించారు. అర్హులైన నిరుపేదలకు దీపం పథకం అందిస్తుందని, మహిళలు అన్ని రంగాల్లో ముందడుగు వేసేలా కేంద్ర ప్రభుత్వం సహకరిస్తుందని తదితర అంశాలపై సేఫ్టీ క్లినిక్ ద్వారా ప్రజల్లో అవగాహన కల్పించారు. కనుమరుగవుతున్న కళారూపాలు, కళాకారులను ప్రోత్సహిస్తున్న శ్రీ సాయి ఇండేన్ గ్యాస్ సర్వీస్ డిస్ట్రిబ్యూటర్ ప్రసాద్‌కు కళాకారులు ధన్యవాదాలు తెలిపారు. ఇండేన్ గ్యాస్ సర్వీస్ స్టాఫ్, కళాజాత బృందం, వేర్నాల కృష్ణ, వేర్నాల ప్రకాష్‌రాజు పాల్గొన్నారు.